క్లుప్తంగా

ఆసుపత్రిలో ప్రసవాలను పెంచాలి



పీహెచ్‌సీలో ఆశా వర్కర్లకు యూనిఫాం దుస్తులు అందజేస్తున్న వైద్యాధికారిణి

గణపవరం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచడానికి ఆశా వర్కర్లు కృషి చేయాలని, ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ ప్రతి ఆశా వర్కర్ దగ్గర కనీసం 10 ప్రెగ్నెన్సీ కిట్లు ఉండాలని, ఎన్‌సీడీ, సీడీ సర్వేను ఈ నెలాఖరులోగా స్క్రీనింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లకు యూనిఫారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జె.విల్సన్, ఆశా నోడల్ అధికారి సీహెచ్‌వీ సత్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర వికాసంను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ చిట్టెమ్మ

దెందులూరు: కిశోరి వికాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని కిశోర బాలికలు, చిన్నారులు స్త్రీ శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాల లబ్ధిని పొందాలని దెందులూరు, పోతునూరు ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని చల్ల చింతలపూడి, దోసపాడు గ్రామాల్లో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో కిశోర్ వికాసం అవగాహన బహిరంగ సమావేశాలు నిర్వహించారు. శాఖ పరమైన సూచనలను సమావేశాల్లో వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు, కిశోర్ బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: 1434వ ఫసలీ నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని వీఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లకు తహసీల్దార్ బి.సుమతి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నీటి తీరువా వసూళ్ల లక్ష్యాల సాధనపై మండలంలో వీఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్‌ఓలు డిజిటల్ అసిస్టెంట్లు సమన్వయంతో బిల్లుల వసూళ్ల విషయంలో లక్ష్యాలు సాధించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యదేవుని కల్యాణోత్సవాలు

కొయ్యలగూడెం: గవరవరం (వెంకయ్యపాలెం)లో స్వయంభుగా కొలువైన శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అయ్యవారు, అమ్మవార్లను వధూవరులుగా అలంకరణ, 8వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణోత్సవం, 9న ఉదయం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతార్చనలు నిర్వహించనున్నట్టు అర్చకులు వాడపల్లి ప్రభాకర కృష్ణమాచార్యులు పేర్కొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

జంగారెడ్డిగూడెం: తాడువాయి గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి రోజు సందర్భంగా బుధవారం ఆరాధన నిర్వహించనున్నట్టు సంఘ సభ్యులు కొక్కొండ బ్రహ్మం, దాగం వేణుగోపాలచారి, శ్రీపాద నరేష్, కొక్కొండ శ్రీను తెలిపారు. ఉదయం స్వామి వారి సుప్రభాత సేవ నుంచి యజ్ఞం, మహాపూర్ణాహుతి సాయంత్రం 4 గంటలకు భక్తుల మధ్య తాడువాయి వీధుల్లో గోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని పీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ జీవన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో నిబంధనలు అతిక్రమించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల, కళాశాల పేరుతో ముద్రించిన పుస్తకాలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు.

గడ్డి పరకలు ఒడిసి పట్టి.. యంత్రంతో చుట్టి!

- ఎండు గడ్డి సేకరణలో రైతులకు ఇబ్బందులు
- గడ్డి చుట్టే యంత్రాలపై రైతుల మొగ్గు
- తక్కువ ఖర్చుతో తీరుతున్న గడ్డి కొరత



యంత్రాలతో చుట్టిన గడ్డి

దెందులూరు: సాగు ఖర్చులు తగ్గించుకునేందుకు రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. కూలీ రేట్లు పెరగడంతో వరి కోతలను యంత్రాల ద్వారా త్వరితగతిన ముగించేస్తున్నారు. కల్లం దాటకుండానే ధాన్యాన్ని విక్రయించేస్తున్నారు. ఈ సంప్రదాయ విధానంతో వరి గడ్డి సమస్య పశు పోషకులకు ఉత్పన్నమవుతుంది. హార్వెస్టర్ వలన ఎండుగడ్డి చిన్న చిన్న ముక్కలుగా బయటకు వస్తుంది. దీంతో గడ్డి వాము ద్వారా పశువుల మేత నిలువ ఉంచిన పరిస్థితి లేకుండా పోయింది. వరిచేలో ఉన్న గడ్డిని సమీకరించలేక సేకరించిన గడ్డిని మోపులుగా వేసుకునే వీలు లేక పొలంలోనే తగలబెట్టేస్తున్నారు.

ఎండు గడ్డి కొరతను అధిగమించేందుకు యంత్రాలు

ఎండు గడ్డి కొరతను అధిగమించేందుకు రైతులు గడ్డి చుట్టే యంత్రాలను అధికంగా వినియోగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితమే ఈ యంత్రాలు అందుబాటులోకి వచ్చినా సరైన అవగాహన లేక కొంతమంది రైతులు మాత్రమే వినియోగిస్తూ వచ్చారు. దీంతో వ్యవసాయ అధికారులు గడ్డి చుట్టే యంత్రాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో గతంలో సుమారు 50 గడ్డి చుట్టే యంత్రాలు వినియోగిస్తే ఇప్పుడు ఆ సంఖ్య 200కు చేరింది. ఈ యంత్రాలను ట్రాక్టర్‌కు అనుసంధానం చేస్తే వరి గడ్డిని మోపులుగా చుట్టేస్తుంది. ఈ మోపులను రైతులు పశువులు పాక వద్దకు చేర్చుకుంటారు. యంత్రంతో ఒక్కో మోపుకు రూ.30 ఖర్చవుతుంది. ఎకరాకు 45నుంచి 55 మోపుల వరకు సమీకరించగలుగుతారు. ఈ గడ్డి మోపులను పొలంలో నుంచి పశువుల పాక వద్దకు చేర్చేందుకు మరో 30 రూపాయలు ఖర్చవుతుంది. మొత్తం మీద పాడి రైతుకు 60 రూపాయలు ఖర్చు కాగా, ఎకరాకు రూ.2000 నుంచి రూ.3000 వరకు ఖర్చవుతుంది. దాణా ఖర్చుల కన్నా ఇది తక్కువే. సేకరించిన గడ్డిని మేట్లుగా వేసుకొని వర్షం పడినప్పుడు టార్పాలిన్ కప్పుకుని రక్షించుకోవాలి. మేలైన గడ్డి ఉండటం లేదు. యంత్రాల కోతతో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది. ఇప్పుడు ఎరువులు అధికంగా వాడడంతో గతంలో మాదిరిగా మేలైన గడ్డి రావడంలేదు. యంత్రాలతో వరి కోతలు కోయడంతో గడ్డి అధికంగా వృథా అవుతుంది.

గడ్డిని తగలబెట్టొద్దు



యంత్రాలతో కోసిన వరి చేలో వ్యర్థాలను తగలబెడుతున్నారు. దీని వలన వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. అంతే కాకుండా భూసారం తగ్గిపోయి, కొత్త సమస్యలు వస్తాయి. గడ్డిని పోగు చేసి లేదా పనలపై ఉప్పు చల్లితే పశువులు ఇష్టంగా తింటాయి. ఈ గడ్డిలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి.

– వై సుబ్బారావు, అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ

సత్యసాయి బోధనలు అనుసరణీయం



మజ్జిగను అందిస్తున్న సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు

భీమడోలు: శ్రీభగవాన్ సత్యసాయి బోధనలు అనుసరణీయమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మజ్జిగతో పాటు పులిహోర ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి రీత్యా ప్రతి ఏటా మజ్జిగ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసిన వేలాది మంది బాటచారులు, భక్తుల దాహార్తి తీరుస్తున్న సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు. చలివేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన మండల కన్వీనర్ వర్దినేడి సత్యసాయిని అభినందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వర్దినేడి సత్యసాయి, ఏఎంసీ డైరెక్టర్ దుద్దేపూడి శ్రీను, భక్తులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



భీమడోలు : విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్



పెదపాడు: విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న గ్రంథ పాలకుడు



దెందులూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి రాంబాబు

భీమడోలు: మానసిక, శారీరక ఉల్లాసానికి ఆటలు ఎంతో దోహదపడతాయని జిల్లా మానవత కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రామాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఏడో రోజైన మంగళవారం ఘనంగా నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాల బాలికలు తెలుగు పద్యాలను ఆలపించి, పలు ఆటలు ఆడారు. గుండుగొలను గ్రంథ పాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎన్‌టీ అమర్‌నాథ్ వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు.కార్యక్రమాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆచరణతోనే సత్ఫలితాలు

దెందులూరు: విద్యార్థులు, తల్లిదండ్రులు చెప్పిన వాటిని ఆచరణలో పెట్టి అమలు చేస్తేనే సత్ఫలితాలు లభిస్తాయని పోతునూరు గ్రంథాలయం అధికారి రాంబాబు అన్నారు. మంగళవారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నీతి కథలు చెప్పటం, చిత్రలేఖనం, ఆటలు పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ

పెదపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థిని తరగతుల్లో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించారు. తొలుత అరిస్టాటిల్, సోక్రటీస్, కారల్ మార్క్స్ జీవిత చరిత్రలను చదివి వినిపించారు. ఈకార్యక్రమంలో భాగంగా అగస్టీన్ గణిత ఉపాధ్యాయుడు కె మోహన్ విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించారు. అనంతరం కంప్యూటర్‌పై బొమ్మలు వేయడంపై శిక్షణ అందించారు. ఈకార్యక్రమంలో గ్రంధపాలకుడు డీ జాన్ బాబు తదిరులు పాల్గొన్నారు.

అక్రమ ఒప్పందాలతో కూటమి మోసం



వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి

దెందులూరు: ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా స్కీముల సంగతి మరిచి స్కాముల బాట పట్టిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి విమర్శించారు. మంగళవారం దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్కీముల ముసుగులో స్కాములు చేస్తూ నాయకులు తమ జేబులు నింపుకుంటున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒప్పందంలోనూ పారదర్శకత కనిపిస్తే నేడు చంద్రబాబు ప్రభుత్వంలో పారదర్శకత లోపించి దోపిడీ, మోసం కనిపిస్తున్నాయన్నారు. ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియా, రాజధాని నిర్మాణాల్లో అంచనాలు ఊహించని విధంగా పెంచి ప్రజా ధనాన్ని దోచుకోవాలని చూస్తున్నారన్నారు. తాజాగా లంచాలు తీసుకుంటూ అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకుని ప్రజలకు చంద్రబాబు షాక్ ఇచ్చారన్నారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారన్నారు. మోసం చేయడంలో చంద్రబాబు దిట్టని ప్రజలు ముఖ్యంగా మహిళలు ఇప్పటికే గ్రహించారని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ఉంగుటూరు: ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని, పనిదినాలు పెంచాలని, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఉంగుటూరు గ్రామంలో ఉపాధి కూలీలు పని చేసే చెరువుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు వేతనాలు, పని దినాలు పెంచాలని కోరుతూ మే 20న దేశవ్యాప్తంగా ఉపాధి పనులు బంద్ చేయాలని ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం పిలుపును జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పిడికెడు మెతుకులు పెడుతున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని పాలక వర్గాలు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏ రోజు కూలీ డబ్బులతో ఆపూట గడిచే పేదలకు వంద రోజులైనా వేతనాలివ్వకుంటే ఎలా బ్రతకుతారని రామకృష్ణ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మే 20న ఉపాధి చట్టాన్ని కాపాడుకోవడానికి చేస్తున్న ఆందోళనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని రామకృష్ణ కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు కె.నాగేశ్వరరావు, మండల నాయకులు జయరాజు, లక్ష్మీ, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోమాలమ్మ జాతర మహోత్సవాలు



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాలవాసుబాబుకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న అర్చకులు



గ్రామ దేవతకు ఆడపడుచులు బిందెలతో మంగళ స్నానాలు చేయిస్తున్న ఆడపడుచులు

ఉంగుటూరు: ఎ.గోకవరంలో గ్రామదేవత సోమాలమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజైన మంగళవారం అమ్మవారికి ఆడపడుచులు బిందెలతో నీరు పోసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గరగల రూపంలో ఉన్న అమ్మవారికి మంగళస్నానాలు ఆచరించారు. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా జాతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోజుకో పేటలో గరగనృత్యం, పొన్నులు నిర్వహిస్తున్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే పుప్పాలవాసుబాబు ఎ.గోకవరంలో ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, సర్పంచి మిద్దే సత్యవతి వేంకటేశ్వరరావు స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటాన్ని అందచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సొసైటీ మాజీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావుబాబ్జి, మరడ మంగరావు, పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమాదేవి, పి.బాలకృష్ణ పాల్గొన్నారు.

వ్యాయామ కళాశాలకు ఎంపీ నిధులు

దెందులూరు: గోపన్నపాలెంలో ఉన్న ఏకైక ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో బాలికల హాస్టల్ నిర్మాణానికి ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ యాదవ్ ఆయన నిధుల నుంచి కోటి రూపాయలు ప్రకటించారు. మంగళవారం కళాశాలను మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి పరిశీలించారు. కార్యక్రమంలో గారపాటి రామసీత, మాగంటి నారాయణ ప్రసాద్, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో కె.శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల ఆటో సీజ్

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు వద్ద మంగళవారం కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ఆటోను ఎస్సై ఆర్.శివాజీ సీజ్ చేశారు. ఏలూరు సమీప ప్రాంతాలతో పాటు ప్రధానంగా తోకలపల్లి గ్రామానికి కోళ్ల వ్యర్థాలను మోరు రవి, మరి కొందరు తరలిస్తున్నారని ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

22న హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర కరపత్రం విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఈనెల 22న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్టు అభయాంజనేయ స్వామి సేవా కార్యక్రమాల సేవకులు తెలిపారు. మంగళవారం గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో శోభాయాత్ర కరపత్రం విడుదల చేశారు. శ్రీ మద్ది ఆంజనేయ స్వామి సన్నిధి నుంచి బైక్ ర్యాలీ జంగారెడ్డిగూడెం మీదుగా కొత్తపేట ఇందిరా నగర్ కాలనీ వద్ద ఉన్న హనుమాన్ మందిరం వరకు నిర్వహిస్తామని తెలిపారు. శోభాయాత్రలో హిందూ బంధువులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మద్ది ఆలయ ఈఓ ఆర్‌వీ చందన, ప్రధానార్చకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కార్లు

దెందులూరు: జాతీయ రహదారిపై సత్యనారాయణపురం కొమరేపల్లి గ్రామాల మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాదు నుంచి గుండుగొలను వైపు ఒక కారు వెళుతుంది. ద్వారకాతిరుమల నుంచి విజయవాడకు మరో కారు వెళుతుంది. ఈ నేప థ్యంలో గుండుగొలను వైపు వెళ్లే కారు సత్యనారాయణపురం కొమిరేపల్లి గ్రామాల మధ్యకు వచ్చే సరికి అతి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టి కుడి చేతి వైపు రోడ్‌లోకి వెళ్లి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ప్రమాదంలో రెండు కార్లు నుజ్జు నుజ్జు అయ్యా యి. రెండు వాహనాల్లోని ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు ద్వారకాతిరుమల, గుండుగొలను గ్రామాలకు చెందిన వారని సమాచారం. రోడ్ సేఫ్టీ పోలీసులు అంబులెన్స్‌లో బాధితులను ఏలూరు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో దాడులు చేసి సారా, 13 మద్యం సీసాలతో మరీదు ధర్మరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. నిందితుడిని జ్యుడిషయిల్ మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచినట్లు తెలిపారు. దాడుల్లో స్పెషల్‌టాస్క్ ఫోర్స్ సీఐ, ఎక్సైజ్ ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు విడుదల చేయాలి



ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి

పెదపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు మే 20వ తేదీన బంద్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు ఎ.రవి పిలుపునిచ్చారు. మండలంలోని పెదపాడు, నాయుడుగూడెం, ఖాజీగూడెం, ఉపాధి హామీ పనులు చేస్తున్న గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల వేతనాలు సకాలంలో విడుదల చేయాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరం వేతన బకాయిలు ఇంత వరకు విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. చట్ట ప్రకారం వారం రోజులకు ఒకసారి వేతనాలు ఇస్తామని చెప్పి, నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వాలు చెప్పే దానికి చేసే దానికి పొంతన లేకుండా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌కే కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

8న శ్రీగిరిపై కల్యాణోత్సవాలు



పద్మావతి, అలివేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి

పోలవరం రూరల్: పోలవరం మండలం బోడిగూడెం గ్రామంలో స్వయంభూగా శ్రీ గిరి పర్వతంపై వెలిసిన పద్మావతి, అలివేలు మంగా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 8న గురువారం నిర్వహించనున్నట్టు ఆచార్యులు బూరుగు వెంకటేశ్వరరావు తెలిపారు. నూతన ఆలయంలో లోక కల్యాణార్థం జరిగే ఈ పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి కళ్యాణ మహోత్సవాలు తిలకించాలని కోరారు. భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారించాలి



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ సుందరి

భీమడోలు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలు ఆర్థిక పరిపుష్టిని సాధించుకోవాలని భీమడోలు ఈవోఆర్‌డీ ఎ.సుందరి అన్నారు. భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు వచ్చే తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాన్ని ఆమె పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లోని రికార్డులు, రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. భీమడోలు గ్రామంలో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్లలో తరలించే విధానాన్ని ఆమె పరిశీలించారు. గ్రామ కార్యదర్శులకు పలు సూచనలందించారు. పంచాయతీలు ఆర్థిక వనరులపై దృష్టి సారించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉందని, నీటి సరఫరా విషయంలో అలసత్వం వహించొద్దని సూచించారు.కార్యక్రమాల్లో కార్యదర్శులు జయరామకృష్ణ, హేమ సుందర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి నీరు రాకుండా చర్యలు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం నాగులపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టినట్టు ఐసీడీఎస్ సీడీపీఓ బ్యూలా తెలిపారు. సాక్షి దినపత్రికలో మంగళవారం వర్షపు నీటిలో అంగన్‌వాడీ కేంద్రం శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని ఒక గది పల్లంగా ఉండడంతో ఆదివారం కురిసిన వర్షానికి నీరు చేరిందని బ్యూలా తెలిపారు. దానిని వెంటనే శుభ్రపరచి, వేరే గదిలో కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. స్థానిక పెద్దలతో మాట్లాడి నీరు లోపలికి వెళ్లకుండా ఏర్పాటు చేశామని తెలిపారు.

అలంకరణలకు పట్టు చీరల సమర్పణ



పట్టు చీరలను చూపుతున్న ఈఓ

ద్వారకాతిరుమల: బ్రహ్మోత్సవాలు సందర్భంగా శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అలంకరణల నిమిత్తం విజయవాడకు చెందిన రావాడ చిరంజీవి అనే భక్తుడు రూ.2 లక్షలు విలువైన పట్టు చీరలను మంగళవారం ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తికి అందజేశారు. ఆ చీరలను ఈఓ మీడియాకు చూపించారు. బ్రహ్మోత్సవాలు జరిగే ప్రతిసారీ స్వామి, అమ్మవార్లకు చిరంజీవి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్నారని ఈఓ తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగయ్య అప్పారావుపేట గ్రామానికి చెందిన వక్కల గడ్డ చంద్రశేఖర్ రావు కుమారుడు వెంకటేశ్వరరావు దుర్గాలక్ష్మీ దంపతుల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.